
ఉండిలో భోగి మంటల సందడి


మహదేవపట్నంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేల నిర్వహణ


యలమంచిలిలో కోడిపందేలు

కాలుదువ్విన పందెంకోళ్లు



సంక్రాంతి సందడికి తెరలేచింది.ఊరూ వాడా ఒక్కటై..బంధుమిత్రులు ఏకమై.. అంబరమంత సంబరంగా జరుపుకొనే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి.. భోగిమంటల సాక్షిగా చెడును దహనం చేసి సంతోషాల కాంతిని నింపుకొని.. సుఖ సంతోషాలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు చేసుకోవడం తెలుగువారి ఆనవాయితీ. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భోగి పండుగ రోజున కోళ్లు కాళ్లు దువ్వాయి. కోట్ల రూపాయలు చేతులు మారాయి. జిల్లాలో దాదాపు 200 బరుల్లో పందేలు నిర్వహించారు. గ్రామ స్థాయిలోనూ జోరుగా పందేలు కొనసాగాయి.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పందెం రాయుళ్ల రంగంలోకి దిగారు. బరుల వద్దకు వందలామంది చేరుకున్నారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయలు చేతులు మారాయి. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సుమారు రూ.150 కోట్లు చేతులు మారి ఉంటుందని చెబుతున్నారు. భారీ పందాలు నిర్వహించడంలో జిల్లాలోనే ఉండి నియోజకవవర్గం అగ్రగామిగా నిలచింది. నరసాపురం రఘురామకృష్ణరాజు సంప్రదాయ డింకీ పందాలను ప్రారంభించారు. ఉండి నియోజకవర్గంలోని సీసలిలో ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు పాల్గొన్నారు. పెద అమిరంలో మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు పందేలకు హాజరయ్యారు. పెదమీరంలో తొలి పందం ఏకంగా రూ. 50 లక్షలు పలికింది. అంత మొత్తంలో పందెం కాసిన వారు మాత్రమే కోడిని బరిలోకి దింపాలి. సీసలిలోనూ ఒక్కో పందం రూ. 25 లక్షల వరకు వెళ్లింది.

అధికార పార్టీదే పైచేయి

పందాల నిర్వహణలో అధికార పార్టీదే పైచేయిగా నిలిచింది. గతంలో ఆసక్తి ఉన్న వారంతా పార్టీలకు అతీతంగా బరులు ఏర్పాటు చేసుకునేవారు. ఇప్పుడు అధికార పార్టీ నేతల ఆశీస్సులుంటేనే పందేలకు అవకాశం కల్పించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే సుమారు 200 బరులు నిర్వహించినట్టు అంచనా. అందులో 80 శాతం అధికార పార్టీకి చెందిన వారికే బరులు లభించాయి. జిల్లాలోని ప్రతి మండలంలోనూ 10కి తక్కువ లేకుండా బరులు నిర్వహించారు, గుండాట, కోతాటలు జోరుగా సాగుతున్నాయి. యలమంచిలి మండలం కలగంపూడి, యలమంచిలిలో కోడి పందేలు భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఆ రెండు బరుల్లోనే తొలి రోజు కోట్ల రూపాయలు చేతులు మారాయి. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ఈ ఏడాది పందాల జోరు అధికంగా ఉంది. అక్కడే గుండాట, కోతాటలు నిర్వహిస్తున్నారు. ఏపీ నిట్ సమీపంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారు పందేలు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో ప్రతిఏటా వెంకట్రామయ్య తోటలో నిర్వహించేవారు. అధికార పార్టీ నేత ఆశీస్సులు లేకపోవడంతో నిర్వాహకుడు ఇతర జిల్లాలో నిర్వహిస్తున్నాడు. తాడేపల్లిగూడెం నుంచి అక్కడకే అధికంగా పందెం రాయుళ్ల తరలివెళ్లిపోయారు. నరసాపురం నియోజకవర్గంలో గత ఏడాది కంటే అత్యధికంగా 22 చోట్ల బరులు వెలిశాయి. నరసాపురం పట్టణ సరిహద్దుల్లో బరులకు తెలంగాణ నుంచి జనం పోటెత్తారు. ఆర్కెస్ట్రాలతో బరుల వద్ద నిర్వాహకులు సందడి చేశారు.

జిల్లాలో జోరుగా పందేలు

- శిబిరాల్లో గుండాట, కోతాటలు
- ఉండిలో భారీ బెట్టింగ్‌లు
- బరులన్నీ అధికార వైసీపీవే
- ఫ్లడ్‌లైట్ల వెలుగులోనూ నిర్వహణ
- శిబిరాలపై మరింతగా పోలీసుల నిఘా


ఆకివీడులో పందేలు తిలకిస్తున్న మహిళలు

మెరవని సినీతారలు

ప్రతిఏటా జిల్లాకు సినీ తారలు, నటులు విచ్చేసేవారు. ఈ ఏడాది తొలి రోజున అటువంటి సందడి కానరాలేదు. ప్రముఖులు తారస పడలేదు. పందెం రాయుళ్ల మాత్రమే ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చారు. జిల్లాలోని కొందరు ముఖ్య నాయకులు మాత్రం పందాల్లో పాల్గొన్నారు. గణపవరం మండలంలో గణపవరం, సరిపల్లె గ్రామాల్లో పెద్ద బరులు జరిగేవి. ఈ ఏడాది ఆ రెండు గ్రామాల్లోనూ సందడి కనిపించలేదు. కొందరు హైకోర్టును ఆశ్రయించ డంతో పందాలకు అడ్డుకట్ట పడింది. దాంతో గణపవరం మండలంలోని ఎ.గోపవరంలో పందాలకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. గతంలో పొద్దు పోయిన తర్వాత పందేలు నిలచిపోయేవి. ఇప్పుడు ఫ్లడ్‌లైట్‌ల మధ్య రాత్రి సమయంలోనూ పందేలు వేస్తున్నారు.

పోలీసుల నిఘా

భీమవరం, జనవరి 14 : జూదశాలలపై ప్రతిసారి పోలీసులు నివేదికలు ఇస్తూ ఉంటారు. అనుమతులు వచ్చాక శిబిరాలు వదిలి వెళ్లిపోతారు. అయితే అక్కడ నుంచి ప్రత్యేక పోలీసు నిఘా ఉంటుంది. ఈసారి ఈ నిఘా మరింతగా పెరిగిందని చెబుతున్నారు. దీనికి కారణం ఎన్నికలు సమీపించడమే కావచ్చు.ఈసారి జూదశాలలు అధికంగా ఉన్నాయి..ఈ బరులు ఎవరివి? భాగస్వాములు ఎవరు వంటి సమాచారం పూర్తిగా అధిష్టానానికి పంపిస్తున్నట్లు చెబుతున్నారు.

సంప్రదాయ పందేల్లో పాల్గొన్న ఎంపీ

నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామ కృష్ణరాజు మూడు సంక్రాంతుల తరువాత భీమవరం చేరుకున్న నేపథ్యంలో భోగిరోజున సంప్రదాయ డింకీ కోడిపందాలను ఆయన ప్రారంభించారు. గతంలో భోగిరోజున ఆయన డింకీ పందేలు ప్రారంభించిన తరువాతనే జిల్లా అంతటా పందేలు జరిగేవి. ఆయన్ను కలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు, ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి వెళుతున్నారు. ఈ సందడిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఒక కారులో ఉన్న ఆరున్నర లక్షల రూపాయలు దొంగిలించారు.


ఉండి మండలం మహదేవపట్నంలో పందేల బరి వద్ద ప్రదర్శనగా ఉంచిన బుల్లెట్

ఆటగాళ్లకు ఆఫర్ల వల

కోడి పందేల బరుల నిర్వాహకుల మధ్య పోటీ పెరిగింది. పందెం రాయుళ్లను ముందుగానే ఆహ్వానించుకున్నారు. తమ బరి లోకి రావాలంటూ ఆహ్వానాలు పంపి మరీ రప్పించుకున్నారు. హైదరాబాద్, కర్నాటక, తమిళనాడు నుంచి పందాల్లో పాల్గొనడానికి విచ్చేశారు. పెదఅమిరంలో హైదరాబాదు వాసులకు బరిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉండి మండలం మహదేవిపట్నంలో బుల్లెట్ ఆఫర్ పెట్టారు. పందేలు అత్యధికంగా గెలుచుకునేవారికి బుల్లెట్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొండ్రుప్రోలులోనూ ఇదే తరహా ఆఫర్ ఇచ్చారు. బుల్లెట్ సిద్ధం చేశారు. జిల్లాలో అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఆశీస్సులు లేని వారంతా ఇతర జిల్లాలకు తరలివెళ్లారు. బరులు నిర్వహించారు. తాడేపల్లిగూడెం నుంచి పేరుమోసిన పందెం రాయుళ్ల ఉంగుటూరు, చింతలపూడి, నిడదవోలు నియోజకవర్గాలకు వెళ్లి పందేలు నిర్వహించారు.


సీసలి కోడిపందేల బరిలో చింతమనేని ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఉండి ఎమ్మెల్యే రామరాజు, తదితరులు


డింకీ పందేలు ప్రారంభిస్తున్న ఎంపీ రఘురామ


ఆకివీడులో పందేల వద్ద గుండాట


పెదఅమిరంలో పందేలు ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, గోకరాజు రామరాజు


జిల్లాలో అంగన్‌వాడీ కార్యకర్తలు పట్టువీడలేదు. ఎస్మా చట్టం ప్రయోగించినా వెరవలేదు. సమ్మె కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిరసనలు తెలిపారు. భోగి మంటల్లో నోటీసులను దహనం చేశారు. గణపవరం, భీమవరం , మొగల్తూరు, కాళ్లలో తదితర ప్రాంతాల్లో ఆందోళనలు చేశారు. వీరవాసరంలో నోటీసులను భోగిమంటల్లో వేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు..

సందడి చేసిన సంక్రాంతి


ఆకట్టుకున్న ఎడ్లబండి ఆకృతి

యలమంచిలి, జనవరి 14: తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.. వీధివీధినా తెల్లవారు జామునే భోగి మంటల వేడి రాజేశారు.. మంచు కురుస్తున్న వేళ చలిలో చిన్నారులు బోగిపిడకలు భోగిమంటల్లో వేశారు.. యలమంచిలి మూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సుందరంగా తీర్చిదిద్దిన స్వాగతద్వారాలు, సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ఆకృతులు సకుటుంబ సమేతంగా విచ్చేసిన అతిథుల సందడితో ప్రాంగణమంతటా సంక్రాంతి శోభ వెల్లివిరిసింది. అతిథులందరికీ పూలు, స్వీట్లు అందించి స్వాగతం పలికారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంప్రదాయబద్ధమైన అలంకరణలు ఫొటోషూట్‌కు, సెల్ఫీలకు నిలయంగా మారాయి. యువత, మహిళలు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్, చిన్నారులకు డాన్స్ పోటీలు, హౌసీ గేమ్‌లు నిర్వహించారు. జబర్దస్త్ టీం, సినీసంగీత విభావరి తదితర వినోద కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి టిఫిన్స్, నాన్ వెజ్ భోజనాలు, స్నాక్స్, టీలతో పాటూ 18 రకాల సంప్రదాయ స్వీట్స్, హాట్‌లను అందించారు.


అతిథులకు స్వీట్లు, పూలు అందిస్తున్న దృశ్యం

అన్నదాతల కుటుంబాల్లో సంక్రాంతి సందడి కనుమరుగైంది. చేతికి అందివచ్చిన పంటలపై ప్రకృతి కన్నెర్రచేయడం, గిట్టుబాటు ధర అందని ద్రాక్షగా మారడం, పెట్టుబడి ఖర్చులు రాక పోవడం, యాంత్రీకరణ పనిముట్లపై వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేయడంతో రైతన్నల్లో పండుగ ఆనందం ఆవిరైంది. కాసులిచ్చే పంట నట్టేట మునగడంతో నష్టాల కష్టాల్లో కొట్టు మిట్టాడుతున్నారు. పండుగనాడూ పొలం గట్లపైనే మాసూళ్లు చేసుకుంటూ గడుపు తున్నారు. మూడేళ్లుగా పంట లాభసాటిగా లేక నష్టాలబారిన పడి ఒడ్డుకు చేరేది ఎలా అన్న నైరాశ్యంలోకి వెళ్లిపోయారు. కౌలు రైతులూ సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. ఒకప్పుడు పాడిపంటలతో తులతూగే పల్లెలు నేడు రైతన్న కంటనీరు చూసి బావురుమంటున్నాయి.

పండుగనాడూ పొలంగట్లపైనే..!


రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

- అన్నదాతల్లో సంక్రాంతి సందడి కరవు
- ప్రకృతి కన్నెర్ర.. నైరాశ్యంలో రైతన్న
- ప్రభుత్వ వింత పోకడలు.. దక్కని గిట్టుబాటు ధర
- నష్టాల సాగులో సొమ్ముందక దిగాలు
- రైతు కన్నీరుచూసి బావురుమంటున్న పచ్చని పల్లెలు

భీమవరం రూరల్/ముదినేపల్లి, జనవరి 14 : సంక్రాంతి పండుగ ఆనందం అన్నదాతకు లేదు. ప్రభుత్వ వింత పోకడలు.. ప్రకృతి కన్నెర్రతో కాసులు ఇచ్చే పంట కాస్తా నట్టేట మునగడంతో సొమ్ము లేక పండుగ వేళ నిరాశగా మారారు. దీంతో సంక్రాంతి పండుగ సందడి రైతన్నల్లో కనిపించడం లేదు. ఓ పక్క సార్వా పంటకు భారీ నష్టం.. మరో వైపు ప్రభుత్వ తీరుతో మూడేళ్లుగా పంట లాభసాటిగా లేక నష్టాలబారిన పడి ఒడ్డుకు చేరేది ఎలా అన్న నిరాశలోకి రైతన్నలు వెళ్లిపోయారు. సంక్రాంతి వచ్చేసరికి దాళ్వా నాట్లువేసి సార్వా పంట సొమ్ము చేతికి వచ్చి పిండి వంటలు, కొత్త దుస్తులు, బంధువులతో హడావిడిగా ఉండే రైతన్నల్లో అది ఎక్కడా కనిపించడం లేదు. గత సార్వా పంట బాగా పండి గట్టుకు చేర్చే సమయంలో తుఫాన్‌తో భారీ నష్టాలు చవిచూశారు. జిల్లాలో 85వేల హెక్టార్లలో సాగు చేస్తే 50వేల హెక్టార్లలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతింది. చివరికి పంట మాసూళ్ల ఖర్చులకే రాలేదు. పైగా ఎకరానికి రూ.25 వేలపైగా నష్టాన్ని చవిచూశారు.

ఏప్రభుత్వ హయాంలోనైనా వ్యవసాయరంగానికి యాంత్రిక పనిముట్లు అవ సరం. సబ్సిడీతో ప్రోత్సాహం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం 80 శాతం పనులకు యాంత్రీకరణ ఉపయోగిస్తున్నారు. అలాంటి తరు ణంలో వైసీపీ ప్రభుత్వం యాంత్రీకరణ పనిము ట్లపై సబ్సిడీ తీసివేదయంతో రైతులకు పెట్టుబడి, పని విధానం భారంగా మారేలా చేసింది. కౌలు రైతులు 50 శాతంపైగా సాగుకు వెనకడుగు వేస్తున్నారు. గడిచిన రెండేళ్లలో జిల్లాలో 10 శాతం వరకు సాగు జరగక పోవడం వంటివి చోటు చేసుకున్నాయి. అలాగే చెరకు, అరటి తోటల సాగు భూమి తగ్గిపోతూ వస్తోంది.

ఈ ఏడాది దాళ్వా సాగు వింతగా సాగుతోంది. జిల్లాలో మెట్ట ప్రాంతంలో నారుమడులు ప్రక్రియ అనుకున్న సమయానికి జరిగినప్పటికీ డెల్టా ప్రాంతం భీమవరం, వీరవాసరం, నర్సాపురం, పెనుమంత్ర, కాళ్ల పలు మండలాల్లో నిన్న మొన్నటి వరకు నారుమడుల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. కొన్ని చోట్లయితే సార్వా పంట మాసూళ్లు ఇంకా చేస్తూనే ఉన్నారు. దీంతో మూడు రోజుల సంక్రాంతి పండుగలో రైతన్నలు తమతమ పొలం గట్లపైనే ఉండాల్సి వస్తోంది.

ముదినేపల్లి మండలంలో తుఫాన్ వల్ల సుమారు 10 వేల ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్న కారణంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అమ్మిన ధాన్యానికి సకాలంలో ప్రభుత్వం నుంచి సొమ్ములు పడకపోవడంతో ఈ ఏడాది సంక్రాంతి పండుగ రైతుల్లో ఆనందం లేకుండా చేసింది. చేతికంది వచ్చిన పంట నీటమునిగి పాడైపోవటం, దక్కించుకున్న ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడు లేకపోవటంతోపండుగను ఆనందంగా జరుపుకోలేని పరిస్థితి ఏర్పడింది. ముంపు నుంచి తేరుకుని ధాన్యాన్ని అమ్ముకున్నప్పటికీ ఆలస్యంగా సొమ్ములు రావటంతో పండుగఏర్పాట్లు చేసుకోలేక పోయారు. దీంతో నైరాశ్యం నెలకొంది.


పొలాన్ని దున్నుతున్న రైతు

పండుగ ఆనందం లేదు



పంట వర్షార్పణం కావటం, అమ్మిన ధాన్యానికి డబ్బులు సకాలంలో రాక పోవటంతో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోలేకపోతున్నాం. అప్పులు తెచ్చి కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. 23 రోజుల తర్వాత ధాన్యం డబ్బులు బ్యాంకుల్లో జమ కావటంతో పండుగ ఆనందాన్ని కుటుంబంలో పొందలేకపోతున్నాం.

- పుప్పాల దుర్గా ప్రసాద్, రైతు- పెదగొన్నూరు

పందేల్లో గెలుపోటములు.. కోడికత్తిదే నిర్ణయం!

- ఉమ్మడి జిల్లాలో తయారీ కేంద్రాలు
- కత్తికట్టే వ్యక్తికి డిమాండ్‌ను బట్టి సొమ్ము చెల్లింపు
- సంక్రాంతి మూడు రోజులూ ఆదాయం ఫుల్


కోడి కాలుకు కడుతున్న కత్తి


కోడికత్తులు

గణపవరం, జనవరి 14: కోడిపందేల్లో గెలుపోటములను నిర్ణయించేది కోడి కత్తికే ఉందని చరిత్ర చెబుతోంది. పోరాడే సత్తా ఉన్న ఎంతటి దమ్మున్న కోడైన సరైన కత్తివేటు తగిలితే నేలకూలాల్సిందే. పందెంలో కోడికత్తికి అత్యంత ప్రాధాన్యత ఉంది. పందెంకోడికి కత్తికట్టడానికి అనుభవం ఉన్న ఓ వ్యక్తికి రోజుకు రూ. 16వేల నుంచి రూ. 25వేలు పనిని బట్టి చెల్లిస్తారంటే దీని ప్రాధాన్యత ప్రత్యేకంగా నిరూపించాల్సిన పని లేదు. కత్తుల తయారి శ్రమ, నైపుణ్యంతో కూడుకున్న వ్యవహారం. అయితే ఈ పందేల్లో దీన్ని వృత్తిగా చేసుకోవడంతో వారికి గిరాకి అధికంగానే ఉంటుంది. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో కోడికత్తులు తయారు చేస్తుంటారు. పందేల్లో సెంటిమెంట్లు ప్రధాన భూమిక పోషిస్తాయనడంలో అతిశయోక్తి లేదు. కోడికి కత్తికట్టే వ్యక్తి హస్తవాసి మంచిదని నమ్మకం ధృడంగా ఏర్పడితే అతడిని తీసుకెళ్తారు. పండుగ మూడు రోజులు ఎంత డిమాండ్ చేస్తే అంత సొమ్ములు ఇవ్వాల్సిందే. ముఖ్యంగా కత్తి బిగింపు కట్టులోనే పందెం ఆధారపడి ఉంటుంది. కుడికాలు పిల్లవేలుకు పలుచటి కాటన్‌గుడ్డ చుట్టి అనంతరం కత్తిపెట్టి దారంతో తయారు చేసిన తాడుతోనే కడతారు. కత్తుల వినియోగం కేవలం సంక్రాంతి సీజన్‌లోనే అయినప్పటికి ఏడాదిపొడవునా కత్తుల తయారీలో నిపుణులు నిమగ్నమవుతారు. గతంలో కోడి కత్తి ఒక్కటి రూ.200 నుంచి రూ.250 వరకు ఉండేది. ప్రస్తుతం రూ.500 వరకు ధర పలుకుతోంది. భారీ వాహనాల చక్రాల బేరింగుల్లో వినియో గించే స్టేయిన్‌లెస్ స్టీల్ కట్టలతో కోడికత్తి తయారు చేస్తారు. విరిగిపోకుండా, మొనవంగిపోకుండా ఉండాలంటే బలమైన టెంపర్ కోసం ఆరుసార్లు వేడి చేస్తారు. ఎంతో సాంకేతిక నైపుణ్యంతో తయారు చేసే కత్తి కేవలం ఒక పందేనికి మాత్రమే వినియోగిస్తారు. కత్తులు లేకుండా పందెం వేస్తే జోడిలంటారు. రెండో రకం పందెంలో రెండు కాళ్లకు కత్తులు కడతారు. కొన్ని సందర్భాల్లో ఒక వేటు తోనే కోడి నేలకొరుగుతుంది. దీంతో పందేలు కేవలం ఐదు నుంచి ఏడెనిమిది నిమిషాల్లోనే ముగుస్తాయి. కత్తులు కట్టే వ్యక్తి సంపాదన మూడుపువ్వులు ఆరుకాయలుగా ఉంటుంది.


వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలు

భౌబోయ్..

- విచ్చలవిడిగా వీధి కుక్కలు.. భయభ్రాంతుల్లో ప్రజలు
- తక్షణమే నివారించాలని అధికారులకు వేడుకోలు

ఆకివీడు, జనవరి 14: కుక్కలతో ఆకివీడు ప్రజలు భయభ్రాంతులు చెందుతున్నారు. జంతుప్రేమతో కుక్కలను చంపకూడదని నిబంధనలుండడంతో అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో వీధివీధికి కుక్కల బెడద పెరిగింది. పగలు, రాత్రులు అనే తేడా లేకుండా రోడ్లపై వెళ్తున్న ప్రయాణికులను, ఇళ్ల దగ్గర ఆడుకుంటున్న చిన్నపెద్ద తేడాలేకుండా ప్రతి ఒక్కర్ని కాటేస్తున్నాయి. స్థానిక కోనూరి వీధిలో ఇంటి దగ్గర ఆడుకుంటున్న బాలుడి చేతిని కరవడంతో కుట్లు పడ్డాయి. వృద్ధుడిని కరవడంతో జనం ఆందోళన చెందుతున్నారు. బయటకు వెళ్లాలంటే భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కుక్కలను నివారించాలన్నారు.

దొంగకు దేహశుద్ధి


దొంగను కట్టేసిన గ్రామస్థులు

మండవల్లి, జనవరి 14: మండలంలోని శోభనాద్రిపురం అగ్రహారంలో దొంగతనానికి పాల్పడిన ఓ యువకుడికి దేహశుద్ధి చేశారు. అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన యువకుడు మద్యం మత్తులో భైరవపట్నం శివారు అగ్రహారం జాతీయ రహదారి పక్కనే బడ్డీ కొట్టులో దొంగతనానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని కట్టేసి దేహశుద్ధి చేశారు.

శేషాచలంపై అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు




కొండపై దూడూ బసవన్నల సందడి.. కళారూపాలను చూస్తున్న భక్తులు, తిరువీథుల్లో విహరిస్తున్న శ్రీవారు

ద్వారకాతిరుమల, జనవరి 14: చిన్నతిరుమలేశుని శేషాచలంపై సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని అనివేటి మండప సమీపంలో అట్టహాసంగా నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు దంపతులు స్వామివారి చిత్రపటానికి పూజలు చేసి, భోగిమంటలను వెలిగించారు. పూరిగుడిసె, కట్టెలపొయ్యి, రంగవల్లులు, ధాన్యం రాశులు, ఎడ్లబళ్లు, వృషభ, అశ్వాలు, కోడిపుంజులు, కళాకారుల విన్యాసాలతో పండుగ శోభను సంతరించుకుంది. గజలక్ష్మి సందడి చేసింది. భక్తులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

భోగి ఉత్సవం రాత్రి క్షేత్రపురవీధుల్లో వైభవంగా జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణములో ఉత్సవమూర్తులను తొళక్కవాహనంపై ఉంచి అలంకరించి అట్టహాసంగా క్షేత్రంలో ఊరేగించారు.

నేత్రపర్వం.. ధనుర్మాసోత్సవం

భోగి పర్వదినాన తొళక్కవాహనంపై ఉభయదేవేరులు, గోదాదేవితో కొలువు తీరిన చిన్నతిరుమలేశుడు క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో తిరుప్పావై సేవలు ఘనంగా జరుగుతున్నాయి. విలాసమండపంలో కొలువైన మూర్తులకు అర్చకులు పూజాధికాలు జరిపారు.

రమణీయం.. గోదా శ్రీరంగనాథుల కల్యాణం


శ్రీవారి క్షేత్రంలో గోదా శ్రీరంగనాథుల కల్యాణం

ద్వారకాతిరుమల/ జంగారెడ్డిగూడెం: గోదా, శ్రీరంగనాథల దివ్య కల్యాణం శ్రీవారి క్షేత్రంలో కడు రమణీయంగా జరిగింది. శ్రీరంగనాథుని భక్తురాలైన గోదాదేవి ధనుర్మాసంలో నెల రోజులపాటు పాసురాల ద్వారా స్వామివారిని కీర్తించి అనంతరం పరిణయ మాడతారు. నిత్యకల్యాణ మండప ఆవరణలో అర్చకులు కల్యాణతంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతనవధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేశారు. భక్తుల గోవిందనామస్మరణలు, డోలు, సన్నాయివాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాలు ఘనంగా జరిపారు.


గోకుల తిరుమల పారిజాతగిరిలో..

జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో ధనుర్మాసం 29వ రోజైన ఆదివారం తిరుప్పావై ప్రవచనం నిర్వహించారు. ఆరాధన, తోమాలసేవ, బాలబోగ నివేదన తీర్థప్రసాద గోష్ఠి జరిపారు. భోగిపండుగను పురస్కరించుకుని గోదా రంగానాథుల కల్యాణోత్సవం అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు అత్యంతవైభవంగా నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు అష్టోత్తర పూజలు చేశారు. వికాస తరంగణి సభ్యులు అప్పారావు మాస్టర్ నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ గావించారు. గంగాధర్, జగపతిరాజు, రెడ్డిరంగ ప్రసాద్, ధనరాజు, అబ్బిన దత్తాత్రేయ, వాసవిశాయి నగేష్ పాల్గొన్నారు.

17న సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు

నరసాపురం, జనవరి 14: సంక్రాంతి ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకుని ఈనెల 17న నరసాపురం-సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు 07251 నంబర్‌తో సాయంత్రం ఆరు గంటలకు నరసాపురంలో బయలుదేరి ఉదయం ఐదు గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. పాలకొల్లు, భీమవరం, టౌన్, ఆకివీడు కైకలూరు, గుంటూరు మీదుగా ఈ రైలు నడవనుంది.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

పోడూరు, జనవరి 14: ఎన్నికలు సమీపిస్తున్నందున అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ఈవీఎంల్లో ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. పెనుమదం సచివాలయం వద్ద తహసీల్దార్ ఆర్.వి.కృష్ణారావు పర్యవేక్షణలో ఓటర్లతో ఓటు వేయించారు. ఆర్ఐ కందుల రాంబాబు, ఈవీఎం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.వర్మ, వీఆర్వోలు బి.ఏసుబాబు, ఎస్‌వి.మెహర్‌బాబా, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఓటమి భయంతోనే దుష్ప్రచారం

నూజివీడు, జనవరి 14: ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావును ఓటమి భయం వెంటాడుతోందని, అందుకే బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీపై దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ నేత నూతక్కి వేణుగోపాలరావు ధ్వజమెత్తారు. భవిష్యత్తుకు గ్యారెంటీ ఓటీపీల విషయమై పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనపై ఆదివారం ఆయన మాట్లాడుతూ, ఓటీపీలు చెబుతే డబ్బులు పోతున్నాయంటూ అసత్యప్రచారానికి ఎమ్మెల్యే దిగుతున్నారన్నారు. దీన్ని నిరూపించగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రప్రభుత్వం వలంటీర్ల ద్వారా గడప గడపకు అంటూ ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ప్రచారం చేసుకుంటోందో అలాగే టీడీపీ తాను అధికారంలోకి వస్తే చేపట్ట బోయే పథకాలపై అవగాహన కల్పిస్తోందన్నారు. చెరుకూరి దుర్గాప్రసాద్, ముసునూరు రాజా, వెంకటరెడ్డి, సత్యనారాయణ, సురేష్, నాగరాజు, దాసరి స్వామి, పర్వతనేని సాయి, నూతక్కి హరిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.



భోగిమంట వేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు, గంగిరెద్దు ప్రదర్శన

భోగిమంటలు, హరిదాసు కీర్తనలు..

పాలకొల్లు టౌన్, జనవరి 14: ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి సంబరాలు సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టాయి. స్థానిక బీఆర్ఎంవి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన సంబరాల్లో నియోజకవర్గ నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో కుటుంబ సమేతంగా తరలివచ్చి సందడి చేశారు. ప్రాంగణంలో సంక్రాంతి పల్లె వాతావరణం చోటుచేసుకుంది. ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గ్రామదేవతకు ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పూజ చేశారు. నిలువెత్తు శివుడు, నంది విగ్రహాలు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దుల సన్నాయిలు, భోగిమంటలు, హరిదాసు కీర్తనాలు, బొమ్మల కొలువు, కోలాటాలు, ప్రముఖుల చిత్రాలు, పిండివంటలు, పచ్చని ఆకులతో స్టాల్, గోరింటాకు, పిల్లల ఊయాల, రోలు రోకలి, రచ్చబండ, పెద్దగోపురం, నాగలితో బండిచక్రాలు, లాంతారు, ధాన్యం, కంకుళ్లు, బల్ల, గ్రామీణప్రాంత తాటాకిళ్లు, పెంకిటిళ్లు, రంగురంగుల ముగ్గులు, ధాన్యం బస్తాలు, అరటిచెట్టు గెలలు, గాలిపటాల ఫొటో సెట్టింగ్, నుయ్యి, గూడిబండి, బండిచక్రాలు, రెండుబళ్లు, ట్రాక్టరు, పొట్టేలు, ఆవులు, కోళ్ల సంక్రాంతి సంబరాలకు ప్రతీకలుగా నిలిచాయి. పిలలు నుంచి పెద్దలు వరకూ సెల్ఫీలు దిగారు.

సినీనటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి మిమిక్రీ నవ్వులతో ముంచెత్తింది. సినీ గాయకురాలు శ్రావణిభార్గవి పాటలు అలరించాయి. జబర్దస్త్ టీమ్ రాకెట్ రాఘవ, గాలిపటాల సుధాకర్, మోహన్, బాబీల అభినయం నవ్వుల వర్షం కురిపించాయి. సత్య సంగీత విభావరి ఆకట్టుకుంది. విశాఖపట్టణంకు చెందిన షాడో, మిర్రర్ నటన, కాంతారా, హవర్ బోర్డు వంటి ప్రదర్శనలు అదరహో అనిపించాయి. చిన్నారుల నృత్యప్రదర్శనలు కనువిందు చేశాయి. వివిధ పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాజకీయ ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.


అమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో మావుళ్లమ్మ ఆలయం కిటకిట

భీమవరంటౌన్, జనవరి 14 : సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని మావుళ్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మను దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ, చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, ధర్మకర్తలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు, రేపు ఆలయంలో..

మావుళ్లమ్మ 60వ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం బోలిశెట్టి చేతన (భీమవరం)వారిచే భగవద్గీత పారాయణం, సాయంత్రం గోగులమ్మ భజన సమాజం(భీమవరం) వారి భజన. కవురు కళ్యాణి (వీరవల్లి పాలెం)వారిచే అన్నమాచార్యసంకీర్తన, యడవల్లి బ్రదర్స్ (తాడేపల్లిగూడెం) వారిచే బుర్రకథ, జగత్ విజేత నాట్యమండలి (మిలటరీ మాధవరం)వారిచే దేవి మహత్యం నాటకం. మంగళవారం మావుళ్ళమ్మ భజన సమాజం (మహదేవపట్నం) వారి భజన, కొల్లాటి మావుళ్ళరాజు (భీమవరం) వీరబ్రహ్మంగారి తత్వల ఆలాపన, శ్రీనివాస కూచిపూడి నృత్య నికేతన్ (భీమవరం) వారిచే కూచిపూడి నృత్యం, జయకూచిపూడి నాట్య కళాక్షేత్రం (భద్రాచలం)వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, మావుళ్ళమ్మ నాట్యమండలి రంగస్థల అణిముత్యాలు.

క్రైం కార్నర్

బక్కెట్లో హీటరు పెట్టి నీళ్లు కాస్తుండగా.. విద్యుదాఘాతంతో బాలిక మృతి


మృతి చెందిన అనూష

ఏలూరు క్రైం, జనవరి 14 : విద్యుదాఘాతానికి ఓ విద్యార్థిని మృత్యువాత పడింది. బక్కెట్లో హీటరు పెట్టి నీళ్ల కాస్తుండగా కరెంటు స్విచ్ ఆపకుండా ఓ బాలిక నీళ్లలో చేయి పెట్టడంతో విద్యుత్ షాక్‌నకు గురై మృతిచెందింది. వివరాలివి. ఏలూరు కబడీగూడేనికి చెందిన కందుల అనూష (12) తల్లి చిన్ననాడే చనిపోయింది. తన సోదరితో కలిసి మేనమామ వద్ద ఉంటూ వట్లూరు గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. సెలవుల్లో ఏలూరులోని ఎమ్మార్సీ కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం స్నానం చేయడానికి బక్కెట్ లో నీళ్లపోసి హీటరుపెట్టి కాస్తుండగా నీళ్ల వేడి ఎక్కాయోలేదో అని కరెంటు స్విచ్ ఆపకుండా చేయి పెట్టింది. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌నకు గురై కేకలు వేస్తూ అలా ఉండిపోయింది. ఇది గమనించిన ఆమె బాబాయ్ వెంటనే స్విచ్ ఆపి బాలికను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. టూటౌన్ ఎస్ఐ కె.శుభాకర్ తన సిబ్బందితో ఆసుపత్రికి వచ్చి మృత దేహాన్ని పరిశీలించారు. బంధువుల నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

మోటార్ బైక్‌ల ఢీ.. ఒకరికి గాయాలు

లింగపాలెం, జనవరి 14: ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివి. ఏలూరుకు చెందిన కనపర్తి అక్షయ్, సింగగూడెంకు చెందిన లోచర్ల వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాలపై వస్తూ లింగపాలెం వద్ద రహదారిపై ఎదురెదురుగా ఢీ కొన్నారు. వెంకటేశ్వరరావు కాలుకు తీవ్ర గాయమైంది. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రథమచికిత్స అనంతరం ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు హిజ్రాలకు గాయాలు

తణుకు, జనవరి 14: మండలంలోని తేతలి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హిజ్రాలకు గాయాలయ్యాయి. వివరాలివి. ఓ ఆటోలో ఆరుగురు హిజ్రాలు ఉండ్రాజవరం మండలం వడ్లూరు వైపు వెళుతున్నారు. తేతలి వద్ద ఎదురుగా వచ్చి కారు ఢీ కొట్టింది. ఆటో బోల్తా కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న హిజ్రాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

పాలమూరులో మహిళకు తీవ్రగాయాలు


పెనుమంత్ర, జనవరి 14 : మండలంలోని బ్రాహ్మణ చెరువు- వీరవాసరం రహదారిలోని పాలమూరు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలివి. పాలమూరుకు చెందిన చిట్టూరి వరలక్ష్మి రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిలిస్టు ఢీకొనటంతో తీవ్రంగా గాయపడింది. తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 కు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది వైద్యసేవలను నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న యువకుడికి గాయాలయ్యాయి.

కారు అద్దాలు పగలగొట్టి చోరీ

కాళ్ళ, జనవరి 14: నర్సాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజు ఇంటి వద్ద నిలిపి ఉన్న కారు అద్దాలు పగలగొట్టి నగదు అపహరించినట్టు అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. పెనుమంత్ర మండలం ఆలమూరుకు చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు కాళ్ళ మండలం పెదఅమిరంలో ఉన్న ఎంపీ రఘురామ కృష్ణరాజును కలిసేందుకు ఆదివారం మధ్యాహ్నం ఆయన ఇంటి ముందు కారు ఆపి ఎంపీని కలిసేందుకు లోపలికి వెళ్లారు. తిరిగి బయటికి రాగా తన టయోటా కారు ఎడమ వైపు ముందు భాగంలో అద్దాలు పగలకొట్టి బ్యాగ్‌లో ఉన్న సుమారు రెండు లక్షల నగదు అపహరించారు. శ్రీనివాస రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరభద్రం తెలిపారు.

లభ్యంకాని రూపాదేవి ఆచూకీ

- కృష్ణానదిలో కొనసాగుతున్న గాలింపు


రూపాదేవి (ఫైల్)

పెదవేగి, జనవరి 14: తోటికోడళ్ల అదృశ్యం.. ఆపై ఆత్మహత్య ఘటనలో చిన్నకోడలు మృతదేహం లభ్యం కాగా, పెద్దకోడలు రూపాదేవి ఆచూకీ లభించలేదు. వివరాలివి. మండలంలోని పినకిడిమికి చెందిన రూపాదేవి, స్వాతిలకు అదే గ్రామానికి చెందిన పాలపాటి కామరాజు, తిరుపతమ్మ కుమారులు శ్రీనివాస్, శివసాయిలతో వివాహం జరిగింది. వరకట్న వేధింపులు ప్రారంభం కావడం, గ్రామ పెద్దలు సర్దిచెప్పడం జరుగుతూ వచ్చింది. వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం మధ్యాహ్నం తోటికోడళ్లిద్దరూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. విజయవాడ చేరుకున్న ఆ ఇద్దరు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్వాతి(33) మృతదేహం లభ్యం కాగా, ఆదివారం పంచనామా, శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని బంధువు లకు అప్పగించామని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. రూపాదేవి ఏమైందనేది తెలియరాలేదని, కృష్ణా నదిలో గాలింపు చేపట్టామని చెప్పారు. నిందితులైన అత్తమామలు తిరుపతమ్మ, కామరాజును అరెస్టు చేశామని పేర్కొన్నారు. భర్తలైన అన్నదమ్ములు శ్రీనివాస్, శివసాయి పరారీలో ఉన్నారన్నారు.

కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడి

లింగపాలెం/ఆకివీడు, జనవరి 14: వేర్వేరు ప్రాంతాల్లో కోడిపందేలు, పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. 27 మందిని అరెస్ట్ చేసి రూ.19,500 స్వాధీనం చేసుకున్నారు. అయ్యప్పరాజుగూడెం, కొత్తపల్లి, ధర్మాజీగూడెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశారు. రెండుకోళ్లు, రెండు కోడి కత్తులు, రూ.2,150 స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ. రెండువేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెన్నారావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఆకివీడు మండలంలో తొమ్మిది కేసులు నమోదు చేసి (కోడి పందేలు- ఐదు, పేకాటలు-నాలుగు) 21 మందిని అరెస్టు చేసి రూ.15,400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

పందేలు వద్దంటూ ధర్నా

పాలకోడేరు, జనవరి 14 : గొల్లలకోడేరులో కోడిపందేలు, జూద క్రీడలు నిలుపుదల చేయాలంటూ గ్రామ సర్పంచ్ కుక్కల లక్ష్మీ దంపతులు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

సంక్రాంతి సంబరాలు







పాలకోడేరులో భోగి పండుగ.. పెంటపాడు రెడ్డి సంక్షేమ సంఘం ముగ్గుల పోటీల విజేతకు ఫ్రిజ్ అందిస్తున్న దృశ్యం.. గణపవరంలో హరిదాసు.. జిన్నూరులో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న దృశ్యం

తాడేరు వంతెన ప్రారంభం

భీమవరం రూరల్, జనవరి 14 : రూ.2కోట్ల 30 లక్షలతో నిర్మించిన తాడేరు వంతెనను శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, ఏఎంసీ ఛైర్మన్ బాబు పాల్గొన్నారు





జువ్వలపాలెంలో భోగి మంటల్లో జీవో కాపీలను దహనం చేస్తున్న ఎమ్మెల్యే రామరాజు... తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి.. తాడేపల్లిగూడెంలో బాబ్జి

భోగి మంటల్లో జీవో కాపీల దహనం

కాళ్ళ/తణుకు/తాడేపల్లిగూడెం అర్బన్/ నరసాపురం/గణపవరం/మొగల్తూరు, జనవరి 14: జువ్వలపాలెంలో భోగిమంటల్లో వైసీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన అప్రజాస్వామిక జీవో కాపీలను వేసి ఏపీకి పట్టిన కీడు తొలగాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రార్థించారు. రానున్న ఎన్నికల్లో దుర్మార్గపు పాలన చేస్తున్న వైసీపీ అంతమొందించాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జీవో కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, తమరాపు రమణమ్మ, కలగర వెంకట



నరసాపురంలో ఎమ్మెల్యే ప్రచురించిన పత్రాలు దహనం చేస్తున్న బండారు

కృష్ణ, ఒమ్మి రాంబాబు, గుబ్బల శ్రీనివాసు, తాతపూడి మారుతీరావు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో టీడీపీ కన్వీనర్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన చీకటి జీవో ప్రతులను భోగిమంటలో వేసి దహనం చేశారు. గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో జగన్ పత్రికలను దహనం చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు. నరసాపురం ఎమ్మెల్యే ప్రచురించిన అభివృద్ధి పనుల శంకుస్థాపన పత్రాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. పిప్పరలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పార్టీ నేతలతో కలిసి భోగి మంటల్లో జీవో కాపీలు వేసి దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.





నరసాపురం బరిలో కోళ్లు వదులుతున్న ఛైర్ పర్సన్ వెంకట రమణ, వైస్ ఛైర్మన్ నాగిని.. పెంటపాడులో కోడి పందేలు..భీమవరంలో గుండాట

గ్రామాల్లో కోడి పందేల జాతర

యథేచ్ఛగా గుండాట.. పేకాట

వీరవాసరం/పాలకోడేరు/పెంటపాడు/పాలకొల్లు/కాళ్ళ/ఆకివీడు/నరసాపురం/మొగల్తూరు/ ఉండి/పోడూరు/యలమంచిలి/పెనుమంట్ర/తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 14: గ్రామాల్లో ఆదివారం పందేల జాతర ప్రారంభమైంది. వీరవాసరం మండలంలో జొన్నలపాలెం, నవుదూరు, అండలూరు, రాయకుదురు, నందమూరుగరువు, వడ్డిగూడెం, మత్స్యపురిపాలెం, మత్స్యపురి గ్రామాలలో బరులు వేశారు. మొత్తంగా కోళ్ళు ఢీకొన్నాయి. నోట్లు చేతులు మారాయి. దీనికితోడు గుండాట కూడా జోరుగానే సాగింది. పాలకోడేరు మండలంలో సుమారు 8 బరులు ఏర్పాటు చేశారు. గుండాట, జూదాలు నిర్వహించారు. కోడిపందేలను చూసేందుకుబరుల వద్ద జనాలు బారులు తీరారు. పెంటపాడు మండలంలో కోడి పందేల జోరు సాగింది. మద్యం ఏరులై పారింది. పాలకొల్లులో ఫ్లడ్‌లైట్ల కాంతిలో ఆదివారం రాత్రి 8గంటలకు సైతం పందేలు, జూద కార్యక్రమాలు జరుగుతునే ఉన్నాయి. కోట్లాది రూపాయలు తొలిరోజే చేతులు మారాయి. పెదఅమిరంలో డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజులు ప్రారంభించారు. సీసలిలో ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి పేకాట, గుండాటలు జోరుగా సాగాయి. పెదఅమిరం, సీసలి గ్రామాల్లో రాత్రి సమయాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా కోడిపందేలు వీక్షించేందుకు ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఆకివీడులో ఒక్కరోజే కోట్లు చేతులు మారాయి. పందేల బరుల వద్ద అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగాయి. నరసాపురం తీరంలో ఈ ఏడాది కోడి పందేల బరులు 20కి పైగా వెలిశాయి. 26వ వార్డు బరిలో ఛైర్ పర్సన్ బర్రి వెంకట రమణ, వైస్ ఛైర్మన్ కామిని నాగినిలు కోళ్ళను బరిలో వదిలారు. మొగల్తూరులో 16 బరులు వెలిశాయి. ఉండి మండలం మహదేవపట్నంలో ఫ్లడ్‌లైట్ల మధ్య పందేలు వేశారు. ఈపందేలకు తెలంగాణ, విశాఖపట్నం, బెంగళూరు, ఢిల్లీ, కర్నాటక తదితర ప్రాంతాలు నుంచి విచ్చేసి తిలకించారు. మహదేవపట్నంలో గెలిచిన వారికి బుల్లెట్‌ను బహుమతిగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రోజుకు 20పందేలు వేసి అందులో ఏ టీం వారు ఎక్కువ పందేలు గెలుపొందుతారో వారికి ఈబుల్లెట్‌ను బహుమతిగా అందిస్తారని సమాచారం. తాడేపల్లిగూడెం పట్టణ శివారులో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించారు. ఒక్కో పందేనికి రూ.10 వేల నుంచి రూ. 5 లక్షల వరకూ పందేలు సాగాయి. ఇక్కడ కూడా బుల్లెట్‌ను బహుమతిగా ప్రకటించారు.

శ్రీదేవి మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 14: పట్టణంలోని ఏలూరు రోడ్డులో గల శ్రీదేవి మహంకాళమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని పూజలు చేశారు. మాజీ కౌన్సిలర్ యెగ్గిన నాగబాబు పాల్గొన్నారు. విచిత్ర వేషధారణలతో ఊరేగింపు ఆకట్టుకుంది.

కోట సత్తెమ్మ జాతర ప్రారంభం



వీరవాసరం, జనవరి 14: వీరవాసరంలో కోటసత్తెమ్మ జాతర ప్రారంభమైంది. ప్రతీ ఏటా సంక్రాంతి పర్వదినాలలో కనుమరోజున అమ్మవారికి జాతర నిర్వహిస్తారు. ఐదురోజులపాటు జరిగే జాతరకు సంబంధించి ఆదివారం అంకురార్పణ చేశారు. గుద్దటి శివరామ నరసింహస్వామి నాయుడు శ్యామలారాణి దంపతులచే కలశస్థాపన, అఖండ దీపారాధన పూజలను చేశారు. ఈ నెల 24 వరకూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా 25న అమ్మవారికి పుట్టింటి వద్ద వడి కట్టు కట్టుకొని ఆలయానికి తీసుకువస్తారు. అదేరోజు అఖండ అన్నసమారాధనను ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామికి అలంకరణ



పాలకొల్లు టౌన్, జనవరి 14: పాలకొల్లు చిన్నగోపురంలో శ్రీఅష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఆఖరిరోజు ఆదివారం స్వామికి విశేషాలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తిరుప్పావై పాశుర విశేషాలను భక్తులకు రంగనాథస్వామి వివరించారు. దేవస్థానం ఛైర్మన్ జవ్వాజి పానకాలు, ఈవో గోవిందరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



కాళ్ళకూరులో గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివ, తదితరులు

కాళ్ళ/మొగల్తూరు/భీమవరం టౌన్/పోడూరు, జనవరి 14: కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కాళ్ళకూరుకు చెందిన మద్దాలి తిరుమల వెంకటేశ్వర్లు (బుజ్జి) దంపతులచే స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు వేద పండితులచే వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు స్వామి అమ్మవార్లను దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరులోని పురాతన రుక్మిణీ సత్యభామా సమేత శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో గోదా సహిత రంగనాయకస్వామి శాంతి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోదాదేవి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. పోడూరులో శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీగోదాదేవి వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది.

పెళ్లి కూతురమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఆచంట, జనవరి 14: శేషమ్మచెరువులో పెళ్లి కూతురమ్మ వారి ఉత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా పెళ్లి కూతురమ్మ వారిని పల్లకీలో ఉంచి ఆచంట పుర వీధులు గుండా ఊరేగించి అనంతరం పెళ్లి కూతురమ్మను శేషమ్మచెరువు తీసుకెళ్లి ఉత్సవాలు ప్రారంభించారు. సంక్రాంతి పండుగ మూడు రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయి.

కోదండ రాముడికి 108 రకాల సారె



భీమవరం టౌన్, జనవరి 14 : భోగి పండుగ సందర్భంగా ఆదివారంనాడు మెంటే వారి తోటలోని కోదండ రామరామాలయంలోని స్వామివారికి అమ్మవారికి 108 రకాల పిండి వంటకాలతోను, పసుపు, కుంకుమతో సారెను అందించారు. వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం చినమిల్లి కుటుంబం అందించిన సారెను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

ఎంపీ రఘు రామను కలిసిన నాయకులు



పాలకోడేరు, జనవరి 14: నర్సాపురం పార్లమెంట్ సభ్యుడు కనుమూరు రఘు రామకృష్ణంరాజు సొంత గడ్డపై అడుగు పెట్టడంతో పాలకోడేరు మండల టీడీపీ నాయకులతో పాటు ఆయన అభిమానులు, కార్యకర్తలు ఆయన్ని కలుసుకునేందుకు పోటీ పడ్డారు. ఉండి నియోజకవర్గ బీసీ టీడీపీ నాయకుడు, గొల్లలకోడేరు గ్రామవాసి అయిన కామన రాంబాబు, మరికొంత మంది టీడీపీ నాయకులు ఆయన్ని కలుసుకుని పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

కోర్టు స్టేతో నిలిచిన కోడిపందేలు

గణపవరం, జనవరి 14: తెలుగుదేశం, జనసేన నేతల నిర్వహణలో కోడి పందేలు జరగకూడదని కోర్టు నుంచి స్టే తేవడంతో గణపవరం, సరిపల్లెలో కోడి పందేలు నిలిచిపోయాయి. దీంతో నిర్వాహకులకు, పందెంరాయుళ్ళకు నిరాశ ఎదురైంది. అయితే వెలగపల్లి, ముగ్గళ్ళ చిలకంపాడు గ్రామాల్లో మాత్రం పందేలు నిర్వహించారు. యథేచ్ఛగా జూదాలు సాగాయి.

50 మంది టీడీపీలో చేరిక

ఇరగవరం, జనవరి 14 : తెలుగుదేశం, జనసేన అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం కేతావారిపాలెంలో గ్రామ నాయకులు దొమ్మేటి భాస్కరరావు, పాలా భూషణం, కేత శ్రీనివాసరావు, వీరవల్లి సింహాద్రి ఆధ్వర్యంలో 50 మందికి పైగా యువకులు, మహిళలు టీడీపీలో చేరారు. వారికి ఆరిమిల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పాలకోడేరు, జనవరి 14: పాలకోడేరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బరాజు సుబ్బమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పి.కృష్ణంరాజు, సత్యవతి దంపతులు, కుమారుడు గణేష్‌వర్మ, కోటిరాజు, గణపతిరాజు, శివప్రియ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నాడు పాలకోడేరులోని పేదలకు సుమారు 500 మందికి దుస్తులు పంపిణీ చేశారు.

భీమవరం టౌన్: డిస్టిక్ ఇంటర్నేషనల్ అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో భీమవరం తాడేరు రోడ్డులో ఇందిరమ్మ కాలనీలోని 80 మంది పేద కుటుంబాల వారికి దుస్తులు పంపిణీ చేశారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, ఇంటర్నేషనల్ అలయిన్స్ క్లబ్ మల్టిపుల్ ఛైర్మన్.సుభద్ర దేవి, నాగలక్ష్మి, రమ్య, మైథిలి, భాగ్యలక్ష్మి, సత్యవతి, మావుళ్ల పాల్గొన్నారు.

పెంటపాడు: టీబీఆర్ సైనిక్ స్కూల్లో సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో భోగి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది వృద్ధులకు వస్త్రదానం చేసి అన్నసమారాధన జరిపారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ పర్వీన్‌కుమారిశర్మ, హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

శివాలయంలో స్వచ్ఛభారత్



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 14: ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వచ్ఛ ఆలయాలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెద్ద శివాలయంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోత తాతాజీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం శుభ్రం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, నాయకుడు కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ యువజనోత్సవాలు ప్రారంభం



బాడీబిల్డింగ్ పోటీల దృశ్యం

ఆకివీడు, జనవరి 14: బాలురు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో డీవైఎఫ్ఐ 41వ సంక్రాంతి యువ జనోత్సవాలను డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు బొక్కా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదల ధనుష్ ప్రారంభించారు. క్రికెట్, వాలీబాల్, చెడుగుడు, చెస్, కరాటే, బాడీ బిల్డింగ్, పాటల పోటీలు, రంగవల్లులు వంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రసూల్‌బీబీ, దోకల రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, బొక్కా వర్మ, గోపిశెట్టి రా ంబాబు, కె.తవిటినాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 14: క్రీడల వల్ల ఆరోగ్యం చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతలకు బాబ్జి బహుమతులు అందజేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, సబ్నీసు కృష్ణమోహన్, ఎరుబండి సతీష్, ముత్యాల శ్రీనివాస్, శ్రీధర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గులతో అంగన్‌వాడీల నిరసన

పెనుమంట్ర/వీరవాసరం, జనవరి 14 : . సీఐటీయూ ఆధ్వర్యంలో పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల.రిలే నిరాహార దీక్షలు .కొనసాగాయి సమ్మె. శిబిరంలో ముగ్గులు. వేసి . నిరసన తెలిపారు. వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీలు భోగిమంట వేశారు. అధికారులు వారికి ఇచ్చిన నోటీసులను మంటల్లోకి వేసి నిరసన తెలిపారు.

భవిత విద్యార్థులకు దుస్తులు, పండ్ల పంపిణీ

ఆకివీడు, జనవరి 14: ఆకివీడు వారపుసంతలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పాఠశాలలో దివ్యాంగులకు జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలకు చెందిన 1987 -88 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం బట్టలు, పండ్లు అందజేశారు. ఏడేళ్ల నుంచి ప్రతీ ఏడాది ఇదే విధంగా అందచేస్తున్నారు. భవిత ఉపాధ్యాయులు డి.సరిత, చంద్రకళ ఉన్నారు.




గొల్లలకోడేరు.. సిద్ధాంతం పాఠశాలల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాలకోడేరు, జనవరి 14 : గొల్లలకోడేరు హైస్కూల్లో చదువుకున్న 1973-74 సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకొని జ్ఞాపకాల్ని పంచుకొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి డాక్టర్ గాదిరాజు గోపాలరాజు, విద్యాదాత గాదిరాజు సూర్యనారాయణరాజు, అన్నదాత కమ్మిలి అప్పలరాజును ముఖ్య అతిధులుగా పిలిచి పూర్వ విద్యార్థులంతా సత్కరించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ గ్రామం వచ్చి స్నేహితుల్ని కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

పెనుగొండ: సిద్ధాంతం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997-1998 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూలులో కలుసుకున్నారు. ఆట పాటలతో గడిపారు. ఈ కార్యక్రమంలో ఆనాటి మిత్రులు కాకినాడ సీఐ కొత్తూరు కిషోర్, రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు, మచిలీపట్టణం సీఐ వాసా పెద్దిరాజు, తోపాటు ముద్రగడ నాగేశ్వరరావు, బొక్కా మార్కండేయులు, కంచర్ల గుప్తా, సానబోయిన అనిల్, సయ్యపరెడ్డి గణపతి, వాసవి సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.